మహేష్‌కుమార్‌గౌడ్‌ను అభినందించిన ఎమ్మెల్సీ


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ దయానంద్

కొత్తపేట, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బొమ్మా మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్‌గుప్తా పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. సోమవారం దయానంద్‌గుప్తా నార్సింగిలోని మహేష్‌కుమార్‌గౌడ్ నివాసంలో ఆయనను కలిసి శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో వాసవీ సేవాకేంద్రం ప్రతినిధులు కే.మల్లికార్జున, బొగ్గారపు శరత్‌చంద్ర, నాయకులు సతీష్‌గౌడ్, అశోక్ పాల్గొన్నారు.

సత్కరించిన దేప

ఎల్బీనగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులైన బి. మహేష్‌కుమార్‌గౌడ్‌ను పీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, పున్న గణేష్‌నేత, బండి మధుసూదన్ రావు, నల్లెంకి ధన్‌రాజ్‌గౌడ్, తలాటి రమేష్‌నేత, జగన్, వెంకటేష్, జ్ఞానేశ్వర్‌యాదవ్, శేఖర్, కల్యాణ్‌యాదవ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలి

చంపాపేట, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యతగా చేపట్టాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అధికారులను కోరారు. చంపాపేట డివిజన్‌లోని సామ సరస్వతికాలనీ, పద్మానగర్‌కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులు రూ.20లక్షలతో కొనసాతునున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం కార్పొరేటర్ పరిశీలించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ సీసీ రోడ్డు నిర్మాణంలో భాగంగా కాలనీవాసులు ఇంటి ఎదుట ఉన్న ర్యాంపులు, మెట్లను తొలగించేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ సురేష్, సామ సరస్వతికాలనీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, కాలనీవాసులు పాండురంగారెడ్డి, అనిల్, జంగయ్య, నాయకులు సద్ది సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

వనస్థలిపురం, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): నాణ్యతా లోపాలు లేకుండా సీసీ రోడ్డు పనులు చేపట్టాలని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సోమవారం బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేజ్-1లో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ కాలనీవాసులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కాలనీల్లో చేపట్టబోయే అభివృద్ధి పనులు నాణ్యతా లోపాలు లేకుండా భవిష్యత్ తరాలకు ఉపయోగపడేవిధంగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ నరేందర్ తేజ, కాలనీవాసులు పాల్గొన్నారు.

కవులు, సాహితీవేత్తలకు సన్మానం

సైదాబాద్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలుగు భాష దినోత్సవం సందర్భంగా చంద్రిక గ్రంథ మండలి ఆధ్వర్యంలో సోమవారం కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, కవి కె. శివారెడ్డిని, సాహితీవేత్త, ఓయూ తెలుగు శాఖ పూర్వ అధ్యక్షులు ఎస్.వి.రామరావు, నీలం రాజశేఖర్‌రెడ్డి బీఎడ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సౌభాగ్యలక్ష్మిలను ఘనంగా సన్మానించారు. తమ సంస్థ ద్వారా పుస్తకాలు ప్రచురించకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కవుల, రచయితల పుస్తకాలు ప్రచురిస్తామని సంస్థ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. విజయభాస్కర్, కార్యదర్శి డాక్టర్ వేముల నారాయణ, ఉపాధ్యక్షుడు జె.నర్సింహ తెలిపారు.

ఘనంగా కాళోజీ జయంతి వేడుకలు


కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న అధ్యాపకులు

హయత్‌నగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి) : హయత్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ కాళోజీ జీవితమంతా అన్యాయాన్ని ఎదురించడంతోనే సరిపోయిందని అన్నారు. తెలంగాణ కోసం ఆయన చేసిన పోరాటం మరువలేనిదని అన్నారు. కార్యక్రమంలో కళాశాల తెలుగు శాఖ అధ్యక్షుడు నర్సింహ, అధ్యాపకులు గంజి శశిధర్, వెంకటలక్ష్మి, మల్లేశం, యాదయ్య, ఇందిర పాల్గొన్నారు.

గట్కా క్రీడాకారులకు ఘన సన్మానం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): ఇటీవల పంజాబ్‌లోని సంఘ్రూర్ జిల్లాలో జరిగిన 8వ జాతీయ స్థాయి గట్కా పోటీల్లో తెలంగాణ రాష్ట్రం తరఫున పాల్గొన్న క్రీడాకారులను సోమవారం మీర్‌పేట్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. సదరు పోటీల్లో 25మంది పాల్గొనగా శాన్విక అనే విద్యార్థిని సిల్వర్ మెడల్ సాధించినట్లు తెలంగాణ గట్కా అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. బీజేపీ మీర్‌పేట్ కార్పొరేషన్ శాఖ అధ్యక్షుడు, కార్పొరేటర్ పెండ్యాల నర్సింహ, 45వ డివిజన్ అక్కి మాధవీఈశ్వర్‌గౌడ్ కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో గట్కా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు రాజేశ్వరి, ప్రధాన కార్యదర్శి రాజేశ్, ఉపాధ్యక్షుడు రవి, కోశాధికారి వాహజ్, నాగార్జున స్కూల్ ప్రిన్సిపాల్ మహేశ్, వాగ్దేవి కాలేజీ డైరెక్టర్ రవికుమార్ పాల్గొన్నారు.

అధికారి వేధిస్తున్నారని ఫీల్డ్ అసిస్టెంట్ల ఆందోళన


డీసీ జయంత్‌ను కలిసి ఫిర్యాదు చేస్తున్న శానిటేశన్ అసిస్టెంట్లు

ఓల్డ్‌మలక్‌పేట, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ మలక్‌పేట సర్కిల్ శానిటేషన్ ఫీల్డ్ అసిస్టెంట్లు సోమవారం సర్కిల్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తమను అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ అనురాధ విధుల పరంగా వేధింపులకు గురిచేస్తుందని ఆరోపిస్తూ డీసీ జయంత్‌కు ఫిర్యాదు చేశారు. చాలీ చాలని వేతనాలతో ఎండనక వాననక క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న సిబ్బందిపై అధికారులు వేధింపులు అధిక మయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీక్లీ ఆఫ్‌లలో ఆప్సెంట్ వేసి సాలరీ కట్ చేస్తుందని, అటెండెన్స్ ఎఫ్ఆర్ఎస్ ద్వారా తీసుకోవటానికి గంట సమయం కేటాయించడం సరిపోవడం లేదని దూరం నుంచి వస్తున్నందున ఉదయం ఐదు గంటల నుంచి ఆరున్నర గంటల వరకు గంటన్నర సమయం పెంచాలని డిమాండ్ చేశారు.

ఉద్యమకారులకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి

హయత్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమకారులకు పెన్షన్‌తో పాటు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలని కోరుతూ సోమవారం హయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ అనీల్‌కుమార్‌కు ఉమ్మడి రంగారెడ్డి జిల్లా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కొంతం యాదిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జెనిగె విష్ణువర్ధన్‌లు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలంతో పాటు పెన్షన్ ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ కోరారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు కారింగుల నరేందర్‌గౌడ్, బోడ నర్సింహ, బట్టీల రవీందర్, జోర్కా రాము ముదిరాజ్, గౌని వీరస్వామిగౌడ్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నేతల రోడ్డు కబ్జాను అడ్డుకోండి

- మునిసిపల్ అధికారులకు బీజేవైఎం నేతల వినతి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో గత బీఆర్‌ఎస్ పాలనలో ఆ పార్టీ నేతలు పార్కు స్థలాలతో పాటు రోడ్లను సైతం కబ్జా చేశారని, సదరు కబ్జాలను అడ్డుకుని ప్రజా రవాణా నిమిత్తం రోడ్లను కాపాడాలని బీజేవైఎం నేతలు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం బీజేవైఎం బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి మునిసిపల్ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడంగ్‌పేట్‌లోని సర్వే నంబర్లు.138,139,144,145లోని ఎంసీఆర్ కాలనీలోని ఓ రోడ్డును కొందరు బీఆర్‌ఎస్ నేతలు ఆక్రమించుకుని రోడ్డుపైనే యథేచ్ఛగా అక్రమంగా షెడ్లు నిర్మిస్తున్నారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ నేతలు పార్కు స్థలాలను అన్యాక్రాంతం చేయడమే కాకుండా చివరకు రోడ్లను సైతం వదలడం లేదని ఆయన విమర్శించారు. మునిసిపల్ అధికారులు దీనిపై విచారణ జరిపి రోడ్డును కబ్జా నుంచి కాపాడి స్థానికుల రాకపోకలకు అనువుగా మార్చాలని ఆయన కోరారు.

మొండికేశారు..

కల్వర్టును పూడ్చేశారు

- పట్టించుకోని ఇరిగేషన్, మునిసిపల్, రెవెన్యూ యంత్రాంగం
- బడంగ్‌పేట్ ప్రధాన రహదారిపై ఇదీ దుస్థితి

నివాస గృహాల్లోకి వరద చేరి స్థానికులు సతమతం

సరూర్‌నగర్, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లో ఓ ప్రధాన నాలా మాయమైంది. అటూ ఇటూ నాలా ఉన్నా.. మధ్యలో ఓ ఫంక్షన్ హాల్ వద్ద 20 ఏళ్లగా ఉన్న నాలా సడన్‌గా (జూన్, జూలైలో) కనిపించకుండా పోయింది. నాలా ఉన్న ప్రాంతం తమ సొంత భూమి అని పేర్కొంటూ స్థానిక దళిత రైతులు కొందరు అందులో మట్టి పోసి మూసేశారు. నాలా అక్కడి ఫంక్షన్ హాల్ భూమిలో నుంచి ఉన్నదని, తమ భూమిలో కాదన్నది వారి వాదన! అయితే తమ హాల్‌లో నాలా లేదని, గతంలో రికార్డులు అన్నీ పరిశీలించి నాలా జాగాను వదిలేసి హాల్ నిర్మించుకున్నామని యాజమాన్యం పేర్కొంటోంది. దాంతో ఇరువర్గాల మొండితనం మధ్య నాలా మాయం కావడంతో బడంగ్‌పేట్-నాదర్‌గుల్ ప్రధాన రహదారిపై పీఎంఆర్ గార్డెన్స్ వద్ద వరదనీరు ముందకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. పర్యవసానంగా నాలాకు ఎగువ భాగాన గల నివాస గృహాలు, 7,8 వ్యాపార సముదాయాలు ముంపునకు గురవుతున్నాయి.

చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం

భారీ వర్షాల నేపథ్యంలో వరద ముంపు సమస్య తీవ్రంగా ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో తాత్కాలికంగా నాలాలోని మట్టిని తొలగించి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బడంగ్‌పేట్ కార్పొరేషన్, బాలాపూర్ రెవెన్యూ, ఇరిగేషన్ విభాగాల అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. నాలా మూసుకుపోవడంతో వరదనీరు దిగువకు వెళ్లకుండా ఎగువ భాగాన నిలిచిపోయి తమ ఇళ్లలోకి వస్తున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాల నుంచి ఇరిగేషన్ రికార్డుల్లో భద్రంగా ఉన్న ప్రధాన రహదారిలోని నాలా మాయం కావడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఇరిగేషన్, రెవెన్యూ, మునిసిపల్ అధికారులు తమ వద్ద రికార్డులను పరిశీలించి నాలా ప్రదేశాన్ని కచ్చితంగా నిర్ధారించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని స్థానికులు పేర్కొంటున్నారు. పట్టా భూమి అంటూ నాలాలో మట్టి నింపిన దళిత రైతులు, సొంత భూమి కాబట్టే నాలా పక్కన హాల్ నిర్మించుకున్నామని వాదిస్తున్న ఫంక్షన్ హాల్ యజమానులు.. ఈ ఇరువర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చి ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన అవసరం ఉన్నదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ఆ దిశలో చర్యలు తీసుకుని నాలా సమీపంలోని నివాసితుల ఇక్కట్లు దూరం చేయాలని వారు సూచిస్తున్నారు.


కల్వర్టును మూసేయడంతో ఎగువ భాగాన గల నివాస గృహాల వద్ద నిలచిన వరదనీరు


కల్వర్టు దిగువ భాగాన్ని మట్టి, చెత్తతో పూడ్చేయడంతో కిందకు వెళ్లకుండా అక్కడే ఆగిపోయిన వరద

నాలుగు రోజుల నుంచి మోకాలి లోతు నీళ్లలో ఉంటున్నాం



నాలా వద్ద మట్టిపోసి నింపేయడంతో వరద నీరు కిందికి వెళ్లకుండా మా ఇంటి వద్దనే ఆగిపోయింది. ఇంటి ఆవరణలోకి మోకాలి లోతు వరకు వరదనీరు, మురుగు నీరు కలిసి చేరింది. దాంతో ఇంట్లో దుర్వాసన వ్యాపిస్తోంది. ఇంట్లో నుంచి బయటకు, బయటి నుంచి ఇంట్లోకి రావడం ఇబ్బందిగా మారింది. ఇంటి బేస్మెంట్ గట్టిగా లేనందున ఎప్పుడు కూలిపోతుందో అని భయం పట్టుకుంది. అధికారులు అస్సలు పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నాలా సమస్యను పరిష్కరించి మా ఇబ్బందులు దూరం చేయాలని కోరుతున్నాం.

\- పెద్దబావి పుష్పావెంకట్‌రెడ్డి, బాధితురాలు

గణేశ్ ఉత్సవాలకు 10వేల మంది సిబ్బందితో భద్రత

- రాచకొండ సీపీ సుధీర్‌బాబు


సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్ వద్ద నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

చాదర్‌ఘాట్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని రాచకొండ కమిషనరేట్ పరిధిలో 10వేల మంది పోలీసు సిబ్బంది విస్తృతస్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ సుధీర్‌బాబు తెలిపారు. సోమవారం సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్ వద్ద గణేశ్ విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేశ్ నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేసుకోవడంలో అన్నివర్గాల ప్రజలు తమవంతు సహకారాన్ని అందించాలని విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం నిరంతరం పోలీసులు అప్రమత్తంగా ఉన్నారన్నారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌పై ఇప్పటికే 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సరూర్‌నగర్ మినీ ట్యాంక్ బండ్‌కు వచ్చే రూట్లలో మొత్తం 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. ఇప్పటికే గణేశ్ విగ్రహాల నిమజ్జనం కోసం 3 క్రేన్లను సిద్ధంగా ఉంచామన్నారు. మహా నిమజ్జనం నాటికి 8 భారీ క్రేన్లను సిద్ధం చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు సీపీ తెలిపారు. ఉత్సవాలకు ఏర్పాట్లతో పాటు, మహా నిమజ్జనం కోసం అవసరమైన ఏర్పాట్లపై అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమీక్షలు జరిపామన్నారు. ఇప్పటికే సరూర్‌నగర్ చెరువు కట్టను పూర్తిగా విద్యుత్ వెలుగులతో తీర్చిదిద్దామన్నారు. నిమజ్జనాన్ని తిలకించేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం తాగునీటి వసతి, మొబైల్ టాయిలెట్ల ఏర్పాటు, చెరువు కట్ట చుట్టూ ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా బారికేడ్లను ఏర్పాటు చేసి, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచామన్నారు. ఎల్బీనగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, ఏసీపీ కృష్ణయ్య, సరూర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి సిబ్బందికి అధిక ప్రాధాన్యం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో కీలకంగా ఉన్న క్షేత్ర స్థాయి సిబ్బంది శ్రేయస్సుకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తామని రాచకొండ సీపీ సుధీర్ బాబు అన్నారు. పోలీస్ సంక్షేమ చర్యల్లో భాగంగా సోమవారం ట్రాఫిక్ సిబ్బందికి వర్షం, ఎండ నుంచి రక్షణ కలిగించే తెల్ల టోపీలు అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ట్రాఫిక్ నియంత్రణ కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సిబ్బందికి ఈ టోపీలు ఒక చిరు ప్రశంస అని, వారికి విధి నిర్వహణ మరింత సులభతరం అవుతుంది అని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిబ్బంది వినియోగించే తెల్ల హెల్మెట్ల కన్నా, ఈ టోపీ ఎంతో అనుకూలంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీసీపీ శ్రీనివాసులుతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి ఫిర్యాదులపై డిస్కం సీరియస్ !

- ప్రతి కార్యాలయంలో అవినీతి సెల్ ఫిర్యాదు నెంబర్లు
- పనిదినాల్లో ఫిర్యాదుల స్వీకరణ
- మొదట మెమోలు.. తీరుమార్చుకోకపోతే సస్పెన్షన్



హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌శాఖలో క్షేత్రస్థాయిలో అధికారులు, సిబ్బంది పనితీరు, అవినీతి ఆరోపణలపై దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రతి విద్యుత్ కార్యాలయంలో అవినీతి సెల్‌కు సంబంధించిన ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉండేలా 10వేల పోస్టర్లు డిస్కం కార్యాలయాల్లో అంటిస్తున్నారు. పనిదినాల్లో(వర్కింగ్ డేస్) ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవినీతి ఫిర్యాదులు స్వీకరించేందుకు ప్రత్యేక ఫోన్ నెంబర్లలో సిబ్బంది అందుబాటులో ఉంటారని అధికారులు చెబుతున్నారు. నిబంధనల పేరుతో కొంతమంది అధికారులు అక్రమ వసూళ్లకు పాల్పడుతూ విద్యుత్ సంస్థలకు చెడ్డపేరు తెస్తున్నారని దీంతో అక్రమ అధికారులపై కఠిన చర్యలు తీసుకునేలా డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ దృష్టి సారించారు. ఫిర్యాదులు వచ్చే అధికారులు, సిబ్బందిపై పూర్తిస్థాయిలో విజిలెన్స్ విచారణ చేయించడంతో పాటూ తప్పుచేసినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. విధినిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు, సిబ్బంది ముందు మెమోలు జారీచేస్తామని, అప్పటికీ వారి తీరు మార్చుకోకపోతే సస్పెన్షన్ చేస్తామని హెచ్చరిస్తున్నారు. దక్షిణ డిస్కం పరిధిలో మొత్తం 20 సర్కిళ్లు ఉండగా గ్రేటర్‌జోన్ పరిధిలో 10 సర్కిళ్లు ఉన్నాయి. శివారు ప్రాంతాల్లోని సర్కిళ్ల నుంచి విద్యుత్‌శాఖ ప్రధాన కార్యాలయానికి ఎక్కువ సంఖ్యలో ఫిర్యాదులు అందుతున్నాయి. అవినీతి ఫిర్యాదులపై ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన 040-23454884, 7680901912 ఈ నెంబర్లకు పని దినాల్లో ఫిర్యాదు చేయొచ్చని ఉన్నతాధికారులు చెబుతున్నారు.

రూ.15కోట్ల విలువైన పార్కు స్థలాలు అన్యాక్రాంతం

- పట్టించుకోని పాలకులు, అధికారులు
- బీజేపీ బడంగ్‌పేట్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

సరూర్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని నాదర్‌గుల్ 31వ డివిజన్‌లో దాదాపు రూ.15కోట్ల విలువైన 5100 గజాల పార్కు స్థలాలు కబ్జాకు గురయ్యాయని, స్థానిక కార్పొరేటర్‌గా మేయర్ బాధ్యత వహించి సదరు స్థలాల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం నాదర్‌గుల్‌లోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇక్కడి 743,746 నుంచి 750 వరకు గల సర్వే నంబర్లలో బుక్క ఫకీర్‌రెడ్డి అనే రైతుకు గల దాదాపు 50 ఎకరాల్లో 1981లో గ్రామ పంచాయతీ లేవుట్ చేశారని, ఆ సమయంలో అందులో నాలుగు ప్రాంతాల్లో మొత్తం 5100 గజాలను ఖాళీ(పార్కు) స్థలాలుగా చూపించారని తెలిపారు. అయితే అనంతరం ఫకీర్‌రెడ్డి కుమారుడైన వెంకట్‌రెడ్డి కొడుకులు ప్రదీప్‌రెడ్డి, ప్రకాశ్‌రెడ్డి కలిసి సదరు 5100 గజాల్లో ఒక చోట ఉన్న 1500 గజాల స్థలానికి రేకులతో ఫెన్సింగ్ ఏర్పాటు చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారన్నారు. ఇక మిగిలిన మూడు ప్రాంతాల్లో ఉన్న 3600 గజాల పార్కు స్థలాలను టీఎస్‌బీపాస్ ను అడ్డుపెట్టుకుని ఎలాంటి లింకు డాక్యుమెంట్లు లేకుండానే మునిసిపల్ అధికారులు, చంపాపేట్ ఎస్ఆర్‌వోతో జత కలిసి అక్రమమార్గంలో తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకుని, అనంతరం గత ఏడాది ఆగస్టులో తమ భార్యల పేరు మీదకు మార్చేశారని తెలిపారు. మునిసిపాలిటీకి చెందాల్సిన ఇంత విలువైన పార్కు స్థలాలు కబ్జాకు గురవుతున్నా సదరు డివిజన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి పట్టించుకోకపోవడం విచారకరమని వెంకట్‌రెడ్డి విస్మయం వ్యక్తం చేశారు. తాము గతంలో మేయర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేసినప్పటికీ దృష్టి పెట్టకపోవడం వల్లనే కబ్జా పర్వం దర్జాగా కొనసాగిందని ఆయన ఆరోపించారు. కార్పొరేషన్‌లోని టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది, మునిసిపల్ కమిషనర్, ఇతర సిబ్బంది కలిసి కొందరు నేతల కనుసన్నల్లో ఈ కబ్జా పర్వం నడిపించారని ఆయన విమర్శించారు. ఇప్పటికైనా మేయర్, అధికారులు స్పందించి సదరు పార్కు స్థలాలను పరిరక్షించాలని ఆయన సూచించారు. లేని పక్షంలో తాము ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, అనంతరం ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు నడికుడ యాదగిరి, పార్టీ బడంగ్‌పేట్ శాఖ ఉపాధ్యక్షుడు శివారెడ్డి, బీజేవైఎం అధ్యక్షుడు రాళ్లగూడెం రామకృష్ణారెడ్డి, పార్టీ నాయకులు నిమ్మల రవికాంత్‌గౌడ్, తోట ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కు స్థలం కబ్జాపై అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 376/5, 14, 16, 18, 19, 21, 22, 27, 29 లేఔట్‌లో ప్రజా అవసరాల కోసం వదిలేసిన ఖాళీ స్థలం కబ్జాకు గురైందని బాటసింగారం మాజీ ఎంపీటీసీ బండిగారి విష్ణుగౌడ్ సోమవారం రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. సదరు సర్వే నంబర్‌లో ప్రజా అవసరాల కోసం వదిలేసిన సుమారు 9 గుంటల ఖాళీ స్థలాన్ని ఓ కళాశాల యాజమాన్యం కబ్జాచేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. గతంలో కూడా ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదని తెలిపారు. దీంతో సదరు కళాశాల యాజమాన్యం ప్రభుత్వ భూమిని కూడా కబ్జా చేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేసి ఖాళీ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ప్రజా అవసరాల కోసం ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ భూమి కబ్జాపై..

పిగ్లీపూర్ రెవెన్యూ పరిధిలో ఓ కళాశాల యాజమాన్యం ప్రభుత్వ, సీలింగ్, భూదాన్ భూములను కబ్జా చేశారని మాజీ ఎంపీటీసీ బండిగారి విష్ణుగౌడ్ అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌కు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా సర్వే నంబర్ 10లోని అసైన్డ్ భూమిని నిబంధనలకు విరుద్ధంగా కళాశాల యాజమాన్యం కొనుగోలు చేశారని తెలిపారు. నక్షలో ఉన్నటువంటి బండ్ల బాటను ఆక్రమించి భవనాలు నిర్మించారని తెలిపారు. వెంటనే దీనిపై పూర్తి విచారణ జరిపించాలని కోరారు. నక్ష బాటను పునరుద్ధరించి అక్రమాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

12న ఐటీఐ కాలేజీలో జాబ్‌మేళా

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈనెల 12వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి వందన ఒక ప్రకటనలో తెలిపారు. మల్లేపల్లిలోని ప్రభుత్వ ఐటీఐ కాలేజీలో ఆ రోజు ఉదయం 11 గంటలకు టాటా కంపెనీ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పదో తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ పాసైన అభ్యర్థులు తమ బయోడేటా, విద్యార్హతల సర్టిఫికెట్లు(ఒరిజినల్, జిరాక్స్)తో మేళాకు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సెల్: 8328428933 నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.


ప్రజాకవి కాళోజీ జయంతి సభలో ఆచార్య పిల్లలమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు, వారిజారాణి, త్రివేణి తదితరులు

తెలంగాణ తెలుగు ఔన్నత్యాన్ని ఎలుగెత్తిన మహనీయుడు కాళోజీ

- హైదరాబాద్ సెంట్రల్ వర్సిటీ తెలుగు శాఖ ఆధ్వర్యంలో కాళోజీ జయంతి వేడుక
- కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్య పిల్లలమర్రి రాములు, దార్ల వెంకటేశ్వరరావు, వారిజారాణి తదితరులు

హైదరాబాద్ సిటీ, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి) : తెలంగాణ భాష, యాస కోసం 'నా గొడవ' ద్వారా తన జీవిత పర్యంతం పరితపించిన గొప్ప మానవతావాది ప్రజాకవి కాళోజీ అని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య పిల్లలమర్రి రాములు కొనియాడారు. కాళోజీ జీవితం, వ్యక్తిత్వం, సాహిత్యంలోని గొప్పతనాన్ని విశ్లేషిస్తూ ప్రసంగించారు. తెలంగాణ తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా సోమవారం సెంట్రల్ వర్సిటీ తెలుగుశాఖ ఆధ్వర్యంలో ప్రజాకవి కాళోజీ జయంతి సభ జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పిల్లలమర్రి రాములు మాట్లాడుతూ నిజాం వ్యతిరేక పోరాటంలో కాళోజీ పాత్రను గుర్తుచేశారు. పత్రికలు, పాలకుల భాష మాత్రమే ప్రజల భాష కాదని, ప్రజా వ్యవహారంలోని భాషను సగౌరవంగా ఆదరించాలని నినదించిన భాషా వాది కాళోజీ అని అభివర్ణించారు. ఆచార్య పి. వారిజారాణి మాట్లాడుతూ పీడిత వర్గ నిర్మూలనే లక్ష్యంగా కాళోజీ కవిత్వం రాశారని, ఆయన కలం నుంచి జాలువారిన ప్రతి అక్షరం అసమానతలను నిలదీస్తుందని అన్నారు. కాళోజీ భాషా వైవిధ్యం అంశంపై పి. విజయ్‌కుమార్ మాట్లాడారు. తెలంగాణ సజీవ భాషలోని ఔన్నత్యాన్ని ఎలుగెత్తి చాటిన మహనీయుడుగా కాళోజిని కొనియాడారు. కార్యక్రమంలో ఆచార్య వి. త్రివేణి, తెలుగు శాఖ పూర్వ అధ్యక్షుడు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య డి. విజయలక్ష్మి, భూక్యా తిరుపతి, కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహీత రమేష్ కార్తీక్‌నాయక్ తదితరులు కాళోజీ చిత్రపటానికి నివాళులు అర్పించారు.

గణపయ్యకు ఘనంగా పూజలు


బాలాపూర్ గణనాథుడిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే తీగలకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఉత్సవ సమితి అధ్యక్షుడు నిరంజన్‌రెడ్డి


బడంగ్‌పేట్ బడా గణేశుడిని దర్శించుకున్న మేయర్ పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు

సరూర్‌నగర్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి వేడుకలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. భజనలు, పూజలు, అర్చనలు, సాంస్కృతిక కార్యక్రమాలతో మండపాలు సందడిగా మారాయి. బాలాపూర్‌లోని ప్రధాన వినాయకుడిని ఆదివారం రాత్రి మహేశ్వరం మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి దర్శించుకోగా, ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్‌రెడ్డి ఆయనకు లడ్డూ ప్రసాదం అందజేశారు. బడంగ్‌పేట్‌లోని బడా గణేశుడిని మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, కార్పొరేటర్లు దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఎల్బీనగర్ : సరూర్‌నగర్ పోస్ట్ ఆఫీస్ చౌరస్తాలో సరూర్‌నగర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని జీహెచ్‌ఎంసీ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. సరూర్‌నగర్ మునిసిపల్ ఆఫీస్ ఎదురుగా ఉన్న గణనాథుడిని పీసీసీ ప్రచార కమిటీ కోకన్వీనర్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కస్తూరి లక్ష్మణ్‌రావు, జాజుల సుభాష్‌గౌడ్, బేర బాలకిషన్ తదితరులు దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వాసవీ కాలనీలో గణనాథుడిని ఏసీపీ కృష్ణయ్య, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఉత్సవ కమిటీ చైర్మన్ చిలుక ఉపేందర్‌రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

చంపాపేట : చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయంలో నవరాత్రి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అర్చకులు కందాళ సంతోష్‌కుమార్ నిర్వహించిన హోమంలో ఆలయ ఈఓ ప్రేమ్‌కుమార్‌రావు, ఆలయ మాజీ చైర్మన్ నల్ల రఘుమారెడ్డి పాల్గొన్నారు.

ఓల్డ్‌మలక్‌పేట : ఓల్డ్‌మలక్‌పేట మార్కెట్ దగ్గర శ్రీవినాయక ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపం వద్ద నిర్వహించిన పూజల్లో సౌత్ జోన్ ఏసీపీ శ్యాంసుందర్ పాల్గొన్నారు.